# నీతి కథ

—ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు

వ్యక్తికి 'నీతి' ఉండడం వల్ల సమాజానికి చాలా మేలు జరుగుతుంది. అయితే ఆ 'నీతి'ని వ్యక్తి పరిధిలో అమలు పరచగల అవకాశం వున్నప్పుడే, సమాజానికి మేలు జరిగేది. అలాకాక, ఎప్పుడైతే అది ఒక 'ఆదర్శం'గా మారిపోయిందో, అప్పుడే అది సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందని అర్థం. ఆచరణ సాధ్యం కాని 'నీతి' వల్ల సమాజానిక్కలిగే మేలేమీ వుండదు. 'నీతి' వుండాలని కోరడమంటే, నీతి అప్పుడు లేదనే అర్థం. నీతి 'నీతికథ' అయిందనే అది చెబుతుంది.

## చిన్నా ముఖంలో ఆనందం పెళ్ళున చిమ్ముతోంది. అంతటి ఆనం దాన్ని వాడు అణచుకో లేకపోతున్నాడు.

తప్పెటమోతని నోటితో అనుకరిస్తూ అడుగులు వేస్తున్నాడు. వాటికి వొక క్రమం లేదు. వేగం తప్ప. అమ్మ మాటలు వాడి చెవికి చేరడం లేదు. ఎందు కింత ఆనందమో చెప్పడు. బురద కాళ్ళతో అడ్డ దిడ్డంగా ఎగురుతున్నాడు. ఇంకిట్లా లాభం లేదని అమ్మ వాడి చొక్కా పట్టుకుని ముందుకు గుంజింది. ఒక్క వూపుతో వాడు అమ్మ వొళ్ళో పడ్డాడు.

'యేందిరా? యేమైంది రా?' అమ్మ ఆత్రుతగా ప్రశ్నించింది.

గుప్పెట విప్పాడు వాడు.

అయిదు రూపాయల కాయితం.

చేతికి చిక్కిన చందమామని అమ్మకి చూపు తున్న ఆనందం వాడి కళ్ళలో.

అమ్మ ముఖంలో వెలుగొచ్చింది.

'యాడిదిరా?'

'దొరికింది మా!'

'నిజ్జం చెప్పు?'

'నిజ్జంగానే మా! సత్తెం' అన్నాడు ఆ చేతిని నెత్తిన పెట్టుకుని —

'యేదీ యిట్టేయి'

అయిష్టంగా అమ్మ చేతికి అందించాడు.

అయిదు రూపాయల కాయితాన్ని అమ్మ మడ తలు విప్పి అటూ యిటూ తిప్పి చూసింది. చిల్లులు యేమైనా వున్నాయేమో అని ఆకాశానికేసి పెట్టి పరీక్ష చేసింది. కాయితం మంచిదే. అయితే కొద్దిగా తడి సింది. బురద అంటింది.

అమ్మ ముఖంలో సంతృప్తి కనిపించింది.

'యాడ దొరికిందిరా?' ఆమె గొంతులో సంతోషం ధ్వనించింది.

యెందుకో గానీ చిన్నాకి కొంచెం భయం వేసింది.

'క్రోటాజన్న బంకు కాడమా' అంటూ అమ్మ వొళ్ళోంచి లేచి దూరంగా నిలుచున్నాడు.

నులక మంచం మీద మెలికాలు విప్పి నిటారుగా కూర్చుంటూ అమ్మ ప్రశ్నించింది.

'యెట్ట దొరికిందిరా?'

వాడు జవాబు చెప్పలేదు.

'అదిట్టేయి' అని అరచినట్టుగా అడిగాడు.

'యెందుకురా నీ కింత?'

వాడు వూహించినంతా అయింది.

కోపంతో వాడి దవడలు బిగుసుకున్నాయి.

వుక్రోషంతో వాడి పెదాలు వణికాయి.

దుఃఖం పొంగుకొచ్చింది.

'నాదీ అది. నాకు దొరికింది. నా కిచ్చెయి.

వాడి గొంతు యేడుపుతో పూడుకుపోయింది.

చాచిన చిన్నా చేతిని అమ్మ పక్కకి నెట్టేసింది.

వాడి వైపు విసుగ్గా వొక్క చూపు విసిరి, కాయి తాన్ని నాయన చేతికి యిచ్చింది.

చిన్నా దుఃఖం కన్నీళ్ళయి కట్టలు తెంచుకున్నది.

ఏడుపును దిగమింగుకోవడం వాడి వల్ల కావడం లేదు.

వెక్కిళ్ళు ఆగడం లేదు.

'చెప్తే నీగ్గాదంట్రా' అమ్మ కోప్పడింది.

అయినా యేడుపు ఆగలేదు.

అమ్మ అనునయించడానికి పూనుకున్నది.

'మంచోడివి గదా! చెప్పిన మాట యినాల. అయినా అంత డబ్బు నువ్వేం జేసుకుంటావ్‌రా!'

'నాకు దొరికింది. నా డబ్బులవి. దాచిపెట్టు కుంటా. చెంగాళమ్మ తిర్నాళ్ళకి కొనుక్కొంటా. గుర్రం మీద కూచ్చోని రంగుర్లాట్నం తిరగతా. గజ్జూరప్పండు కొనుక్కొంటా. అప్పుడు మళ్ళీ నిన్ను డబ్బులడగనే అడగనుమా' వెక్కుతూనే అన్నాడు వాడు.

'నా నాయన గదా, నా మాటిను. తిర్నాళ్ళ యిప్పుడే యాడ.. యెండాకాలం లీవుల్లో గదా! అప్పుడు నీకు నా డబ్బులిస్తానుగానీ యిదిచ్చెయి. నీకు టుపాకు గూడా కొనిస్తా' అని నవ్వి చెప్పింది అమ్మ.

చిన్నా ఆలోచనలో పడ్డాడు.

తన అశక్తత తెలుస్తూనే వుంది.

డబ్బులు చేజారకుండా అడ్డుకోలేడు.

అయినా తన సొత్తు అమ్మపరం కావడాన్ని వాడు భరించలేదు.

అండ కోసం వాడు నాయన వైపు చూశాడు

కుడి అరచేతి మీద గడ్డాన్ని ఆన్చుకుని, చూపుడు వేలును ముక్కు మీద పెట్టుకుని, యింధులో తన కేమీ సంబంధం లేదన్నట్టుగా నాయన నిరాసక్తంగా చూశాడు.

ఇంక తన మాట నెగ్గదని చిన్నాకి తెలిసిపోయింది. అయినా అంత తేలిగ్గా అయిదు రూపాయలు అమ్మకి యిచ్చేయడం వాడికి యిష్టం లేదు.

'అయితే నాకు చెంగాళమ్మ తిర్నాళ్ళకి అయిదు రూపాయలియ్యాల. యిప్పుడు మురుకులు కొను

క్కోను డబ్బు లియ్యాల' అన్నాడు.

అమ్మ సరే అన్నది.

అయిదు రూపాయల నోటు నాయన చేతి నుంచీ అమ్మ చేతికీ, 'అక్కడి నుంచి చిన్నా చేతికీ వచ్చింది.

'యిదిగో నట్టింటి గోడకి సంచి తగిలించుండాది గానీ, తీస్కోని బొయ్యి శేరు బియ్యం, వంద గ్రాముల శెనిగె నూని, పది పైసాలు ఆవలుద్దిపప్పు, పావలాకి మిరియాల్జిలకర, పది పైసాలికి తెల్లగెడ్డ తీస్కోని రా బో' అని పని పురమాయించింది.

'అట్నే షుబ్రదమ్మ దెగ్గిర రెండు మురుకులు కొనుక్కొచ్చుకో బో'

తన డబ్బులతో తనకే వరం యిస్తున్నట్టుగా వున్న అమ్మ మాటలకి వాడికి గుర్రుగా వుంది.

అసలు తను డబ్బులు అమ్మకి చూపించకుండా వుండాల్సింది. దొరికిన డబ్బులు దొరికినట్టుగా తెచ్చి పుస్తకాల గూట్లో కాయితాల కింద దాచిపెట్టేసి వుండాల్సింది అని వాడికి అనిపించింది.

విసురుగా సంచి తీసుకుని అంగడికి బయలుదేరాడు.

మూడు రోజులుగా యింతే.

చిటుకూ బొటుకూ మని వాన కురుస్తూనే వుంది. రేడియోలో తుపాన్ అని చెప్పారు — అమ్మ నాయన వానని విసుక్కుంటున్నారు — చిన్నాకి మాత్రం సంబరంగా వుంది.

వానొస్తే కచ్చేరి బడికి సెలవు.

నాయన యింట్లో వుంటే అమ్మకి అంతగా భయపడనవసరం లేదు. సందు దొరికినపుడు బయటకి జారుకుంటే వాన నీళ్ళలో ఆటలే ఆటలు. అప్పుడప్పుడూ తడవచ్చు. మాలాల తిరుగుళ్ళో మోకాటి లోతు నీళ్ళలో కాళ్ళు దున్నుతూ నడవడం భలే వుంటుంది. వీధి బావి దగ్గర కాయితం పడవలు వదిలి, వాటి వెనకే నడవడం, నీళ్ళకి అడ్డుకట్టలు వేయడం, ప్రవాహాన్ని మళ్ళించడం వాడికి యిష్టం. వానొచ్చి వెలిసిన తర్వాత తూనీగలు ఆకాశం నిండా రెక్కలు విప్పుకొని ఎగురుతుంటాయి. వాటిని పట్టుకుని తోకకి దారం కట్టి ఎగరేయడం వాడికి భలే సరదా.

అయితే అమ్మా నాయన మాత్రం వానని చెడ తిడుతున్నారు.

'బాగన్నా కురవదు - పోనన్నా పోదు. యిట్టా దాపురించిందే' అంటుంది అమ్మ - నిమిష నిమిషానికీ యిదే సణుగుడు.

నాయన మూడు రోజులుగా పేటకి పోవడం లేదు. నిండేరు పారుతూ వుంది. చుట్టు తిరుక్కుని పోయినా, వానలో పని వుండదు. యింట్లో మాత్రం అగచాట్లుగా వుంది. బియ్యం లేవు. ఉప్పు, పప్పు సరేసరి. నిన్న మధ్యాహ్నం అన్నం మిగిలితే, చింతపండు పులుసు కలిపి తలా కొంచెం దోసిళ్ళలో పెట్టింది అమ్మ. ఈ రోజు మధ్యాహ్నం వుప్మా చేసింది. రాత్రికి చేయడానికి యింక యేమీ లేదు. ఇక్కన పక్కన వాళ్ళని బదులు అడుగుదామన్నా కష్టమే. అందరూ పేటకి పనికి పొయ్యేవాళ్ళే — అందరిళ్ళలో యిదే పరిస్థితి.

చిన్నా యిదంతా గమనిస్తూనే వున్నాడు.


మూడేళ్ళ కిందటి వరకూ యింట్లో పరిస్థితులు బాగానే వుండేవి. అన్నానికి యేనాడూ యిబ్బంది లేదు. చిన్నావాళ్ళ నాయన విలేకరి. పేపరు కోసం సొంతంగా ప్రెస్సు పెట్టాలని వున్న కయ్యా కాలవా అమ్మేశాడు. ప్రెస్సయితే పెట్టలేదు గానీ యింట్లో పూట గడవడం కష్టం అయిపోయింది. యెంతకాలమని అప్పులు చేయడం? యిచ్చేవాళ్ళున్నా తీర్చే దారేది? చిన్నపుడు నేర్చుకున్న మిషను పని యిప్పుడు అక్కరకి వచ్చింది. పేట బజార్లో ప్లాట్‌ఫారం మీద మిషను పెట్టాడు. మిషను కుట్టడం పరువు తక్కువ పనేమీ కాదు. కానీ, విలేకరిగా, కనిపించిన అందరి నుంచీ నమస్కారాలు అందుకున్న నాయనకి హఠాత్తుగా ప్లాట్‌ఫారం మీదకి చేరడం ఇబ్బందిగానే వుంది. అయినా వస్తులుండలేక తెలిసిన పని చేసుకోక తప్ప లేదు.

చిన్నాకి నాయన మీద జాలి పొంగుకొచ్చింది.

ఈ రెండు మూడేళ్ళుగా యింటి పరిస్థితి మారి పోయింది. యింట్లో అరుపులు, కేకలు, అల్లరి, ఆటలు లేవు. ఎవరికి వారే మౌనంగా మారి పోయారు. నాయన యింట్లో వున్నంతసేపూ యేదో ఆలోచిస్తూ, దిగులుగా వుంటాడు. చిన్నక నాయన్ను చూస్తే వొక్కోసారి భయం వేస్తుంది. అమ్మతోసరే, తనతో కూడా సరదాగా మాటలాడడు.

ఇంతకు ముందు సాయంత్రం అయితే యిల్లు కళకళలాడేది. బడి నుంచి వచ్చింది మొదలు నాయన పేటనుంచి యెప్పుడెప్పుడు వొస్తాడా అని ఎదురు చూసేవాడు. నాయన తెచ్చే పొట్లం వాడిని వూరిస్తూ వుండేది.

వీధి వాకిట్లో సోఫా కుర్చీలో నాయన వాళ్ళో



వాడు కూర్చునే వాడు. రోజుకో కథ చెప్పించుకునే వాడు. అన్నీ నీతి కథలే. స్వాతంత్ర్య పోరాట కథలంటే చిన్నాకి భలే యిష్టం. గాంధీ తాత గురించి, నెహ్రూ గురించి మళ్ళీ మళ్ళీ అడిగి చెప్పించుకునే వాడు. పుస్తకాల అటక మీద తెల్లట్ట పుస్తకం వొకటి వుండేది. అట్ట మీద గాంధీ తాత బొమ్మ వుండేది. నాయన ఆ పుస్తకం చదివి ఈ కథలన్నీ చెప్పేవాడని చిన్నా అనుకునే వాడు. గాంధీ తాత చిన్న నాటి కథ వొకటి వాడికి చాలా యిష్టం. రెండో తరగతి తెలుగు వాచకంలో ఆ కథ వుండేది. బళ్ళో కన్నా, నాయన వాళ్ళో కూర్చుని వింటేనే వాడికి ఆ కథ వినసొంపుగా వుండేది. గాంధీ వాళ్ళ బడికి వొకసారి స్కూళ్ళ యిన్స్పెక్టరు వచ్చాడు. పిల్లలకి పరీక్ష పెట్టాడు. డిక్టేషను చెప్పాడు. గాంధీ వొక పదం తప్పు రాశాడు. క్లాసు టీచర్ యిది గమనించాడు. గాంధీ పక్కన చేరి, పక్కవాడి పలక చూసి సరిగా రాయమని సైగ

వేశాడు. గాంధీ వొప్పుకోలేదు. దెబ్బలకయినా సిద్ధమే గానీ గాంధీ అటువంటి నీతిమాలిన పనిచేయడు. అందుకే ఆయన అంత పెద్దవాడు అయ్యాడని నాయన చెప్పేవాడు. చిన్నా తను కూడా గాంధీ అంత వాడు అవుతానని అనుకునేవాడు. గాంధీ తాత అబద్ధం చెప్పడు. కుంటోళ్ళు, గుడ్డోళ్ళకి సాయం చేయాలని చెప్పాడు. ఈ ప్రభావం చిన్నా మీద చాలానే వుండేది. స్కూల్లో తన స్నేహితులకి గాంధీ తాత గురించి గొప్పగా చెప్పేవాడు. తనకి మంచి అని తోచిందంతా వాడు గాంధీ తాతకి ఆపాదించేవాడు. మనం నీతిగా వుంటే గొప్పవాళ్ళం అవుతామన్న సత్యాన్ని వాడు మనస్ఫూర్తిగా నమ్మేవాడు.

నాయనతో పాటు చిన్నా అప్పుడప్పుడూ మీటింగులకి వెళ్ళేవాడు. పెద్ద వాళ్ళ సరసన కుర్చీలో కూర్చునేవాడు. తనను ఎవరైనా పలుకరిస్తే నమస్కారం చేసేవాడు. 'మీ నాయనంతటి వాడివి కావాలోయ్' అని వాళ్ళు భుజం తట్టి అన్నప్పుడు చిన్నాకి భలే గర్వంగా వుండేది. ప్రపంచంలో గాంధీతాత తర్వాత అంత గొప్పవాడు నాయనే అని వాడు అనుకునేవాడు.

అయితే యిటీవల యింట్లో మారుతున్న పరిస్థితులు వాడిని కలవరపెడుతున్నాయి. యెందుకిలా అవుతోందో వాడికి అంతుచిక్కడం లేదు. నాయన గొప్పవాడు కదా, మంచివాడు కదా! మరి యిన్ని కష్టాలు యెందుకో చిన్నా చిన్ని బుర్రకి అర్థం అయ్యేది కాదు.

నాయనని అమ్మ సూటిపోటి మాటలు అనేది.

'నువ్వెత్తు చాతగానోడివి. మాకింత కూడు గూడా పెట్టలేకపోతుండావ్' అనేది.

'అప్పో సప్పో జేసి యింత ఎలికల మందు కొనుక్కో రాబో, తలా యింత తాగి వస్తాం' అని యేడ్చేది.

నాయన బదులు పలికేవాడు కాదు. మౌనంగా వినేవాడు.

మాటలన్నీ పడేవాడు.

అయితే ఆయన లోలోపల బాధతో కుమిలిపోతున్నాడని మాత్రం చిన్నాకి తెలిసిపోయేది.

***

చిన్నాకి ఈ విషయాలన్నీ గుర్తొచ్చాయి.

వాడి గుండెల్లో కెలికినట్టయింది.

సుభద్రమ్మ యింటి దగ్గరికి వచ్చాడువాడు..

'ఛా, దొరికిన డబ్బులు ముందుగానే అమ్మకి యిచ్చేసుండాల్సింది గదా' అనుకున్నాడు.

అమ్మని వేధించినందుకు సిగ్గుపడ్డాడు.

వాడికి యిప్పుడు మురుకులు కొనుక్కోవాలని అనిపించలేదు.

గిరుక్కున వెనుతిరిగి అంగడి వైపు నడిచాడు.

***

కోటిరాజ బంకు సమీపిస్తుండగా చిన్నా దిగ్గొట్టినట్టుగా నిలచిపోయాడు.

బంకు ముందు యెవరో ఆడమనిషి వెతుకులాడుతోంది. వాడి గుండె గతుక్కుమన్నది. భయం భయంగా కొద్దిగా ముందుకు నడిచాడు.

# వెరిలో వెన్నె

## ఎగిరితే పడాల్సిందే మరి!

"విప్లవాత్మకమైన రచనలపై మీ అభిప్రాయం ఏమిటి?" అని ఓమారు ఓ రచయిత కట్టమంచి రామలింగారెడ్డిని ప్రశ్నించాడు.

"విప్లవాత్మకం అంటే?"

"గతానుగతికంగా వస్తున్న పద్ధతికి విరుద్ధంగా అన్నమాట."

"అలా అయితే మంచిదే! కాని కాప్రాలజీ కాకుండా చూసుకోవాలి" అన్నారు కట్టమంచి.

కాప్రాలజీ అన్న మాటకి అర్థం తెలియలేదు ఆ రచయితకి. 'అంటే ఏమిటండీ?' అని అడిగాడు.

దానికి రామలింగారెడ్డి చిరునవ్వునవ్వి "ఏమీలేదు, అది స్కటాలజీ అనే మాట" అన్నారు. దాంతో ఆ రచయితకి కోపం వచ్చి "మీదగ్గర క్రొత్త విషయాలు నేర్చుకోడానికి రాలేదు నేను" అన్నాడు. దానికి రెడ్డి తాపీగా "అలవాటు లేదు కాబోలు!" అన్నారు. "ఏ అల వాటు?" అనడిగాడు రచయిత. అదే చిరునవ్వుతో రెడ్డి "క్రొత్త విషయాలు నేర్చుకొనే అలవాటు!" అన్నారు. ఆయన విసిరిన విసురుకి రచయిత ముఖంలో కత్తివేటుకి నెత్తురుచుక్క లేదు.

—పోలాప్రగడ

ఆ ఆడమనిషి చిన్నాకి తెలుసు.

బుడదమడుగు అంటారు. మాదిగిళ్ళలో వుంటుంది. వంకాయలు, బెండకాయలు తెచ్చి వూళ్ళో అమ్ముతుంది. 'బుడదమడుగు' పేరు వాడికి భలే విచిత్రంగా వుండేది. అయితే ఆ పేరే ఆమెకి సరైనదని వాడు అనుకునేవాడు. ఆమె వొళ్ళు యెప్పుడూ మురికి కొట్టుకుని వుండేది. మాసిన పీలికలు వొంటికి చుట్టుకుని వుండేది.

సన్నటి వానలో ఆమె బంకు ముందు వెతుకుతోంది. దిస పాదాలతో నేలని కసాపిసా తొక్కుతోంది.

ఆమె చుట్టూ కొందరు ఆసక్తిగా మూగారు.

'యిగో ... యిక్కడేనమ్మా! అయిదు రూపాల కాయితం. కరుకుమాయలేదు - మచ్చటంగా మల్లించి బొడ్లో దోపుకొని శెట్టంగిడికి వొచ్చినాను. సామాన్లు తీసుకొని బొడ్డు తడిమితే యేముండాది...? యింకెట్టా బగమంతుడా, రేతిరికి నా బిడ్డల కడుపుకేం బెడ్తా నా నాయనా...' అంటూ ఆమె గోలు గోలున యేడుస్తోంది.

చుట్టూ చేరిన జనం తలో మాట అని తప్పుకుంటున్నారు.

చిన్నా చేయి అప్రయత్నంగా నిక్కరు జేబులోని అయిదు రూపాయల కాయితాన్ని తడిమింది.

బుడదమడుగు గబగబా చిన్నావైపు వచ్చింది.

వాడి వొళ్ళు వొక్కసారిగా చల్లబడింది.

వణుకు పుట్టుకొచ్చింది-

భయంతో బిర్ర బిగుసుకుపోయాడు.

నిక్కరు జేబులోని అయిదు రూపాయల కాయితాన్ని వొడిసి పట్టుకొన్నాడు.

ఆమె చిన్నాని దాటి ముందుకు నడిచి అక్కడ యింకెవరికో వివరిస్తోంది -

'తల్లా! తెల్లార్నించీ వానలో నానతానే మోకాట్లోతు బుడదలో నాట్లేసినానమ్మా! కష్టం జేసిన సొత్తు దక్కలేదే తల్లా'

'నలుగురు నడిచే దారిలో యింతసేపా ... యింకేడ దొరకతాది? సొత్తు నీది గాదనుకోబో' అంటున్నారెవరో.

బుడదమడుగు నోరూ, యేడుపూ ఆగలేదు.

'నా రెక్కల కష్టం. యే నా సయితి బొడ్లోకి బోయిందో, యేనా బట్ట బీడీల్దాగేసినాడో ... అట్టబోయి యిట్టొచ్చేలోగా అణిచేసినారే, వాళ్ళ చేతుల్లో వుండు బుట్ట. వాళ్ళ కాపరం గూల...' యింక దొరకదని నిర్ణయించుకుని తిట్లకి దిగింది.

వేడుక చూస్తున్న జనానికి చురుక్కుమనింది.

'చాల్చాలు గానీ యింక నోర్మూసుక్కొని పో. నీకా డబ్బు రాతలేదనుకో. ఈ పూటకి ఆడా యిడా యారకొచ్చి నీ బిడ్డలకింత బెట్టుబో' అని మందలించారు.

చిన్నా చిన్ని గుండె జాలితో నిండిపోయింది.

బుడదమడుగు కన్నీళ్ళు వాడిని కదిలించివేశాయి.

'యిచ్చేస్తే పోలా' అనుకున్నాడు వాడు.

నిక్కరు జేబులో బిగిసిన పిడికిట్లో అయిదు రూపాయల కాయితం భద్రంగా వుంది.

చేతిని జేబులోంచి కొంచెం బయటకు తీశాడు.

వాడికి అప్పుడు యిల్లు గుర్తొచ్చింది.

అమ్మ యేడుపులు, నిందలు, నిట్టూర్పులూ గుర్తొచ్చాయి. నాయన మౌనపు ముఖం గుర్తొచ్చింది.

వాడి పిడికిట్లో అయిదు రూపాయల కాయితం మరింత బిగుసుకున్నది. చేతిని నిక్కరు జేబు లోపలికి మరింతగా దోపేసి అంగడి వైపు నడిచాడు.

చిన్నాకి యిప్పుడు వాళ్ళ నాయన చెప్పిన నీతి కథలేవీ గుర్తు రాలేదు. ■